క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్

చోడవరం రూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతిలో 580 మార్కులు సాధించిన విద్యార్థినులు ఎస్. సాయి శ్రీవల్లి నూజివీడుకు, 569 మార్కులతో విద్యార్థిని జి.షర్మిల ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్టు హెచ్‌ఎం రామిరెడ్డి తెలిపారు. వీరిని హెచ్‌ఎంతోపాటు పేరెంట్స్ కమిటీ చైర్ పర్సన్ కుమారి, ఉపాధ్యాయినులు అభినందించారు.

దాతల సహకారంతో ఆలయానికి టైల్స్ ఏర్పాటు



కె.జె.పురం దుర్గాలమ్మ ఆలయంలో టైల్స్ వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో దుర్గాలమ్మ ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా దాతల సహకారంతో టైల్స్ వేశారు. గ్రామానికి చెందిన ఆడారి బాపునాయుడు, అప్పలనర్సమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు సన్యాసినాయుడు, మనవడు మోహన్‌ల ఆర్థిక సాయంతో ఆలయం మండపానికి ఫ్లోరింగ్ టైల్స్ నిర్మాణ పనులు చేపట్టారు. రూ.30 వేలతో ఈ పనులు చేపట్టారు. గతంలో పరిదేశమ్మ ఆలయ నిర్మాణంలో వీరు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో రుద్ర హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: స్థానిక వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో రుద్ర హోమం, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. సోమవారం అమావాస్య సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకుడు దొరబాబుశర్మ తెలిపారు.

పూతదశలో వేరుశనగ పంట



చిరికివానిపాలెంలో వేరుశనగ సాగు

కె.కోటపాడు: మండలంలోని మెట్ట ప్రాంతాల్లో రైతులు అధిక విస్తీర్ణంలో ఖరీఫ్ వేరుశనగ సాగు చేస్తున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఈ పంటకు మేలు చేశాయి. ప్రస్తుతం ఆర్.వై.అగ్రహారం, చిరికివానిపాలెం, ఉగ్గినవలస, యడ్లవానిపాలెం, వారాడ, వి.సంతపాలెం, కొరువాడ, డి.అగ్రహారం గ్రామాల్లో 150 ఎకరాలలో పంట పూతదశకు చేరుకుంటోంది. ఈ పూతదశలో ఎకరానికి 200 కిలోల జిప్సం వేయడం వల్ల నూనె దిగుబడి శాతం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

కె.కోటపాడు: మండలంలో పిండ్రంగి, మేడిచర్ల గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాల్లో వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న 11 రకాల పౌరసేవలకు సంబంధించి ధ్రువపత్రాలను జారీ చేస్తామన్నారు.

ఆశాజనకంగా నారుమడులు

- అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- మరో 2 వారాల్లో ఖరీఫ్ వరి నాట్లు



గొలుగొండలో వరి నారుమడి



రోలుగుంటలో పచ్చగా నారుమడి

రోలుగుంట/గొలుగొండ: ఖరీఫ్ వరి ఆకుపోత పనులు దాదాపుగా పూర్తయ్యాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు వరి నారుమడులు ఆశాజనకంగా ఉన్నాయి. మరో రెండు, మూడు వారాల్లో నీటి ఆయకట్టు ప్రాంతాల్లో వరినాట్లు ప్రారంభం కానున్నాయి. ఆ తర్వాత నుంచి వర్షాధారిత ప్రాంతాల్లో దమ్ములకు సిద్ధం కానున్నారు. మూడు రోజులుగా తీవ్ర ఎండ కాసినప్పటికీ నాలుగు రోజుల నుంచి చిన్నపాటి వర్షం కురుస్తుండటంతో వాతావరణం చల్లబడింది. నారుమడులకు ఈ వర్షాలు కలసి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అధికంగా ఆర్జీఎల్ విత్తనాల పంపిణీ

మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 40 టన్నుల వరి విత్తనాలను రాయితీపై రైతులకు సరఫరా చేశారు. వీటిలో నెల్లూరు సన్నాలు, సోనా మసూరి, సాంబమసూరి, ఎంటీయూ 1069 తదితర రకాలున్నాయి. 60 శాతంపైగా రైతులు కోరిన ఆర్జీఎల్ విత్తనాలను పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లోను ఆకుమడులు పచ్చగానే ఉన్నాయి. ప్రాథమిక దశలోనే నారుమడులు తెగుళ్ల బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని రోలుగుంట మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు గ్రామ స్థాయి సహాయ వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు.

గెడ్డల నీరే ఆధారం..

గొలుగొండ మండలం దారకొండ దిగువున మూడు వేల ఎకరాల్లో నాట్లు వేసేందుకు రైతులు నారుమడులు సిద్ధం చేశారు. దారపట్టి, విప్పలపాలెం ఆయకట్టు ప్రాంతాల్లో ముందుగానే నాట్లు వేస్తారు. ఏమాత్రం వర్షం పడినా దారగెడ్డ, బొడ్డేరు, బోరింగ్ గెడ్డ, గొర్రిగెడ్డ గెడ్డల నీరు ప్రవహించడంతో వరినాట్లకు ఉపక్రమిస్తారు. ఇక్కడ నాట్లు వేసిన తర్వాతే మిగులు నీరు తాండవ జలాశయానికి వెళ్తోంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కాలువలు, బావుల కింద కొన్నిచోట్ల ఎలుకల ఉధృతి అధికంగా ఉంటుంది. నారుమడి దశ నుంచి పంట కోత వరకు ఇవి తీవ్ర నష్టం కలిగిస్తూ ఉంటాయి. వీటిని పట్టించటానికి రైతు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. కాబట్టి ముందస్తుగా మేలైన యాజమాన్య చర్యలు చేపడితే వీటిని నివారణ చేపట్టవచ్చని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు.
- వర్షాలు విస్తారంగా కురిస్తే నారుమడుల్లో అధికంగా నీటిని ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అందులో వర్షపు నీటిని బయటకు పంపి డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను వేసుకోవాలి.
- నారుమళ్ల నుంచి నీటిని తొలగించి ఎకరాకు ఐదు కేజీల యూరియా, ఐదు కేజీల పొటాష్ వేసుకోవాలి. ఈ విధంగా చేస్తే వరినారు పాడవకుండా ఉంటుంది.

మీనామృతం తయారీపై అవగాహన



మీనామృతంపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ గుణావతి

రావికమతం: పంట ఎదుగుదలకు, దిగుబడికి చేప బెల్లం ద్రావణం(మీనామృతం) ఎంతగానో ఉపయోగ పడుతుందని ప్రకృతి వ్యవసాయ రిసోర్స్ పర్సన్ గుణావతి తెలిపారు. కొత్తకోట, దొండపూడి గ్రామాల రైతులకు మీనామృతం తయారీపై ఆదివారం ఆమె అవగాహన కల్పించారు. కేజీ నల్లబెల్లం, కేజీ చేపల పొట్టును లీటరు నీటిలో కలిపి 25 రోజుల పాటు నిల్వ చేయాలన్నారు. రోజూ కర్రతో కలియతిప్పుతూ ఉంటే మీనామృతం తయారవుతుందన్నారు. పంటకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. వంద లీటర్ల నీటిలో మూడు లీటర్ల మీనామృతం వేసి పంటకు పిచికారీ చేస్తే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ ద్రావణాన్ని ఆర్నెల్ల వరకూ నిల్వ చేసుకోవచ్చన్నారు. రైతులందరూ తయారు చేసుకోవాలని సూచించారు.

నేడు జె.డి.పేటలో 'గడప గడపకు'

మాడుగుల రూరల్: జె.డి.పేటలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఆదివారం తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొనే ఈ కార్యక్రమంలో మండలంలో పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

30వ తేదీ వరకు ఉపాధి సామాజిక తనిఖీలు

దేవరాపల్లి: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలు చేపడుతున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి ఆదివారం తెలిపారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు 20,37,26,299 రూపాయలతో చేపట్టిన 588 పనులకు సంబంధించి తనిఖీలు చేస్తున్నారన్నారు. ఈ నెల 15న సోషల్ ఆడిట్ బృందాల పర్యటన ప్రారంభమైందని, 30వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ నెల 31న మండల స్థాయి ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

కె.కోటపాడు: యువకులు చదువులతోపాటు క్రీడల్లోను రాణించాలని జనసేన పార్టీ నాయకుడు రాయపురెడ్డి కృష్ణ అన్నారు. గొట్లాం గ్రామానికి చెందిన యువకులకు ఆదివారం ఆయన క్రికెట్ కిట్ అందించాడు. ఈ సందర్భంగా క్రీడల్లోనూ మంచి ప్రతిభతో మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని అభిలాషించారు.

కె.జె.పురంలో ఘనంగా మోదకొండమ్మ పండగ

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం బూడి



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కె.జె.పురం కళావేదికపై ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం

మాడుగుల రూరల్: అమ్మలగన్న అమ్మ కె.జె.పురం మోదకొండమ్మ పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామ వీధులు మిరమిట్లు గొలిపేలా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కాళ్ల అప్పలనాయుడు, సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, నాయకులు ఆడారి కన్నారావు, మళ్ల కన్నబాబు, మద్దాల వెంకట సత్యనారాయణ, కాళ్ల అమ్మతల్లినాయుడు మాస్టారు, సూరిశెట్టి అచ్చిమినాయుడు, ఆడారి భాస్కరరావు, కమిటీ సభ్యులు, పంచాయితీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం

కె.జె.పురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక కళావేదిక మీద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. బీపీ, సుగర్, తదితర వ్యాధిగ్రస్తులను వైద్యులు పరీక్షించారు. ఆరోగ్య సహాయకుడు పి.శంకరరావు, హెచ్‌వీ పుష్పకాంతం, ఎంఎల్‌హెచ్‌పీ లత, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. ఆడారి కామునాయుడు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో సాయంత్రం ఏలేనుగు ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం నుంచి గ్రామ పురవీధుల్లో గరగలు నృత్యం, పులివేషాలు, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఉపాధి పనులు కల్పించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న అజయ్‌పురం గిరిజనులు

రావికమతం: అటవీ పట్టా భూముల్లో ఉపాధి పనులు చేపట్టి తమకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ అజయ్‌పురంలో ఆదివాసీలు ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పాంగి చంద్రయ్య మాట్లాడుతూ తమ గ్రామంలో 28 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. గతంలో ఇక్కడ చేపట్టిన రోడ్డు పనులు ఉపాధిలో చేశామన్నారు. ఆ తర్వాత నుంచి పనులు లేక ఖాళీగా ఉన్నామన్నారు. ఈ దృష్ట్యా తమకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో జీడితోటలు పెంచుకుంటున్నామని, వీటిని ఉపాధి హామీ పథకంలో చేరి తమకు పని కల్పించాలని గిరిజనులు పాంగి విజయ్, సూరిబాబు కోరారు.

ప్రమాదకరంగా రక్షణ వంతెనలు



దాలివలస కెనాల్ మార్గంపై ఛిద్రమైన రక్షణగోడ

కె.కోటపాడు: మండలంలో రైవాడ కెనాల్ మార్గంపై నిర్మించిన వంతెనల రక్షణ గోడలు పలు చోట్ల ఛిద్రమయ్యాయి. వీటిపై రాకపోకలు సాగించేందుకు వీలుగా జీవీఎంసీ అధికారులు నిర్మించి 25 ఏళ్లకుపైగా అవుతోంది. ఈ నేపథ్యంలో వాహనాలు వీటిని తరచూ ఢీకొనడంతో ధ్వంసమయ్యాయి. దీంతో దాలివలస, కె.కె.అగ్రహారం, గవరపాలెం, డి.అగ్రహారం గ్రామాల కెనాల్ మార్గంలో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. రాత్రిళ్లు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

అనకాపల్లిటౌన్ : స్థానిక బెల్లం మార్కెట్ యార్డులో కొలువైన లక్ష్మీగణపతిని ఎన్టీఆర్ క్రీడామైదానం వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కోటిపల్లి కిశోర్ మాట్లాడుతూ క్లబ్ ద్వారా ఏ చిన్న కార్యక్రమం తలపెట్టిన విఘ్నాలకు అధిపతి అయిన గణపతిని పూజించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. విశాఖ జిల్లా భీమిలి బీచ్‌లో జరిగే క్లబ్ సమావేశానికి పయనమయ్యారు. మధ్యాహ్నం క్లబ్ సభ్యులందరూ సహపంక్తి భోజనాలు చేశారు.

గిట్టుబాటు ధరలతోనే రైతు ఆత్మహత్యలకు అడ్డుకట్ట



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

అనకాపల్లి రూరల్ : పంటలన్నింటికీ గిట్టుబాటు ధర కల్పించి రైతుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వాలు కృషి చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు సూర్యనారాయణ కోరారు. దేశ వ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు ప్రతి ఏటా పెరుగుతూ ఉండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అనకాపల్లి కార్మిక కర్షక నిలయంలో ఆదివారం జరిగిన అఖిల పక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల మేలు కోసం వెంటనే స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీల అమలు కోసం దేశవ్యాప్తంగా రెండో దశ పోరాటాలు ప్రారంభమయ్యాయన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన పంటల కనీస మద్దతు ధరల అభిప్రాయ సేకరణ కమిటీ సమావేశానికి రైతు సంఘాలను పిలవకుండా స్టార్ హోటళ్లలో సమావేశం కావడం దారుణమని ఏపీ రైతు సంఘాల నాయకులు ఎ. బాలకృష్ణ, పీఎస్ అజయ్‌కుమార్ ఆరోపించారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా పంటల మద్దతు ధర నిర్ణయించడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 16 పంటలకు మాత్రమే మద్దతు ధర ప్రకటించి బెల్లం సహా ఇతర పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. ఎరువులు, పురుగు మందులను సహకార సంఘాల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల సాధనకు ఈ నెల 25న మునగపాకలో చేపట్టబోయే జిల్లా సదస్సుకు రైతు సంఘాల నేతలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు అప్పలరాజు, కర్రి అప్పారావు, గండి బోయిన బాబు, పి. శంకర్రావు, నరాల సత్యనారాయణ, కిసాన్ కాంగ్రెస్ నాయకుడు కె. ఏడుకొండలు, రైతు స్వరాజ్య వేదిక నాయకుడు బాలు తదితరులు పాల్గొన్నారు.

గవర కులస్తులను బీసీ-ఏకు మార్చాలి

తుమ్మపాల: గవర కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చి, వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని అంతర్జాతీయ గౌరీ సేవా సమాఖ్య ఐక్యవేదిక చైర్మన్ ఆడారి ఉమాశంకర్ అన్నారు. పట్టణంలో ఆదివారం గవర కులస్తులు, వక్తల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర కులాన్ని బీసీ-ఏ గా ప్రకటించేలా ప్రతి ఒక్కరు ఉద్యమించాలన్నారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న బొడ్డేడ ప్రసాద్ ఈ విషయమై ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలన్నారు.

విప్ ధర్మశ్రీ హెచ్చరికలతో కాంట్రాక్టర్‌లో చలనం

- జీఎస్ రోడ్డులో మదుము పనులు పునః ప్రారంభం



స్థానిక ఆర్సీఎం చర్చి వద్ద కొత్త మదుము వేసేందుకు పొక్లెయిన్‌తో పనులు

రోలుగుంట: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హెచ్చరికలతో కాంట్రాక్టర్‌లో కదలిక వచ్చింది. కొన్నాళ్లుగా శిథిల మదుము తొలగించి నిలిపివేసిన పనులను రెండ్రోజులుగా చేపడుతున్నాడు. భీమిలి-నర్సీపట్నం రోడ్డులో మండలంలోని వెలంకాయలపాలెం నుంచి కంచుగుమల కూడలి వరకు శిథిలమైన మదుమల స్థానంలో కొత్తవి వేసేందుకు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నెల రోజుల క్రితం పనులు చేసి వదిలి పెట్టి వెళ్లిపోయాడు. దాంతో తొలగించిన మదుముల వద్ద రోడ్డు వెడల్పు లేక వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ఇక్కడ మదుము కోసం తీసిన గోతుల్లో వర్షపు నీరు చేరడంతో రాత్రిళ్లు అదుపు తప్పి ప్రమాదవశాత్తు పడితే ప్రాణాలు దక్కవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, జిల్లా పార్టీ ప్రతినిధి పోతల లక్ష్మీశ్రీనివాస్ ఈ నెల 13న ప్రభుత్వ విప్ ధర్మశ్రీని కలసి మదుము, రోడ్డు పనులు జాప్యంపై ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందించి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కాంట్రాక్టర్ ఆపేసిన పనులను ప్రారంభించారు. పనుల్లో కదలిక రావడంపై సమస్య తీరనుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ విప్‌కు ఎంపీపీ, జెడ్పీటీసీ కృతజ్ఞతలు తెలిపారు.

నెరవేరుతున్న 'గడపగడపకు' హామీలు



సత్యవరంలో సీసీ డ్రైనేజీ నిర్మాణం

- గ్రామాల్లో జోరుగా డ్రైనేజీ పనులు

మాడుగుల: మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇచ్చిన హామీలు అంచెలంచెలుగా అమలవుతున్నాయి. మాడుగుల పట్టణంలో రూ.24 కోట్లతో సీసీ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, అగ్రి ల్యాబ్ తదితర పనులు పూర్తయ్యాయి. సాగరంలో రూ.10 లక్షలతో సీసీ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. సత్యవరంలో రూ.8 లక్షలతో సీసీ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. ఎం. కోడూరులో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. ఆయా గ్రామాల్లో డిప్యూటీ సీఎం ఆదేశాలతో ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలను ట్రాన్స్‌కో అధికారులు సరి చేస్తున్నారు. శిథిలమైన విద్యుత్ స్తంభాలు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా తలుపులమ్మతల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న మోదమాంబ అమ్మవారు

మాకవరపాలెం: మండలంలోని తూటిపాలలో తలుపులమ్మతల్లి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఏటా ఈ పండగను గ్రామస్తులు వైభవంగా నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పండగలో స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మోదమాంబ పండగ

చోడవరం రూరల్: భోగాపురం గ్రామంలో మోదకొండమ్మ పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు నుంచి అమ్మవారికి మహిళలు పసుపుకుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు గౌరీ సహాయక సంఘం సమకూర్చిన ప్రసాదాన్ని అందజేశారు. స్థానిక ప్రధాన కూడలిలో సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున నిర్వహించిన జాతరలో ఘటాలను ఊరేగించి భారీ బాణసంచాతో సందడి చేశారు.

స్థానికంగానే అధునాతన వైద్య సేవలు

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పట్టణ వాసులు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పట్టణ ఆరోగ్య కేంద్రాల నూతన భవనాలను త్వరలోనే వినియోగంలోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వెల్లడించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం మున్సిపాలిటీ ఏడో వార్డులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.86 లక్షలతో చేపట్టిన ఆస్పత్రి భవనం దాదాపుగా పూర్తి కావచ్చిందని తెలిపారు. అన్ని వీధుల్లో డ్రైనేజీలు, సీసీరోడ్లు, తదితర మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలను నేరుగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం కొత్తవీధి రామాలయంలో పూజలు చేశారు. ఎమ్మెల్యేతోపాటు స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చర్ కమ్యూనికేషన్ కల్చర్ హెడ్ సినీనటుడు జోగినాయుడు పరజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు లగుడు స్వామి, వార్డు ఇన్‌చార్జి కిల్లాడ లోవరాజు, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషాబేగం, కర్రి శ్రీనువాసరావు, పార్టీ నాయకులు మామిడి శ్రీను, దాడి బుజ్జి, గంటా లలిత, అన్నపూర్ణ, శారద, దేవత అరుణ పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డి దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు



వైవీ సుబ్బారెడ్డికి సమస్యలు వివరిస్తున్న వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ నాయకుడు చిరికి శ్రీనివాసరావు

మాడుగుల: జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ నాయకుడు చిరికి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం విశాఖ నగరంలో ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఏజెన్సీ నుంచి మైదాన మండలాలకు బదిలీలు, సరెండర్ లీవ్‌లతోపాటు పీఎఫ్ లోన్ మొత్తం విడుదల, కొత్తగా ఎమ్మార్సీల భవనాల నిర్మాణం, డిప్యూటీ డీఈవో పోస్టులు భర్తీ చేయాలని, పాఠశాలల మెయింటెనెన్స్‌కు నిధులివ్వాలని కోరారు.

డాక్టర్ సూరిశెట్టికి పురస్కారం



ఉత్తమ నంది పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సూరిశెట్టి వెంకట ఆది నాగేశ్వరరావు

కోటవురట్ల/కశింకోట : కశింకోటకు చెందిన వాస్తు జ్యోతిష్యుడు డాక్టర్ సూరిశెట్టి వెంకట ఆది నాగేశ్వరరావుకు తెలంగాణకు చెందిన రితిక ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో ఉత్తమ నంది-2023 పురస్కారం లభించింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 60 మంది వివిధ రంగాల నిష్ణాతులకు ఆదివారం బిర్లా భాస్కర ఆడిటోరియంలో ఆదివారం ఈ పురస్కారాలు అందజేశారు. దీనిలో భాగంగా నాగేశ్వరరావును 'జ్యోతిర్వాస్తు భాస్కర' బిరుదుతో పాటు నంది పురస్కారం అందించి సత్కరించారు.